నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 13 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

టీబీజీకేఎస్ కార్యాలయాన్ని పునర్నిర్మిస్తాం

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

టీబీజీకేఎస్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, ఆగస్టు 12 : సింగరేణి కార్మికులు, కార్యకర్తల సౌకర్యార్థం టీబీజీకేఎస్ కార్యాలయాన్ని పునర్నిర్మిస్తామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆయన కార్యాలయాన్ని సందర్శించారు. గది పరిసరాలను దగ్గరుండి పరిశీలించారు. కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సభ్యుడు బడికెల రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తులు సుదర్శన్, నాయకులు సత్యనారాయణ, దామెర కిరణ్, అలీ, ఖలీల్, సబ్బని అరుణ్, రాకేశ్, కిరణ్ ఉన్నారు.

బాబోయ్ పులి

పరందోలిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయ్, ఎఫ్ఆర్వో మజారొద్దీన్

కెరమెరి, ఆగస్టు 12 : జిల్లా అడవుల్లో పులి సంచరిస్తుండగా, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వరుస దాడుల నేపథ్యంలో గజగజ వణికిపోతున్నారు. ఇటీవల కెరమెరి మండలం దేవాపూర్ అటవీ ప్రాంతంలో మేకలపై పులి దాడి చేసిన ఘటన మరవక ముందే శనివారం రాత్రి పరందోలి గ్రామంలో రెండు కుక్కలను చంపివేయడం కలకలం రేపుతున్నది. పుల జాడ కోసం అటవీ, పోలీసు అధికారులు రంగంలోకి దిగినా ఫలితం లేకుండా పోతున్నది. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అది చిక్కడం లేదు. సోమవారం ఎస్ఐ విజయ్, ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ సిబ్బందితో కలిసి పరందోలి గ్రామాన్ని సందర్శించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. దాడులకు పాల్పడుతోంది పులినా.. లేకా చిరుతనా అనేది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని, ఏదేమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అర్జీదారుల మొర వినరా..?

అధికారులు లంచ్‌కు వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన గ్రీవెన్స్ చాంబర్


అధికారులు వెళ్లిపోవడంతో తమ దరఖాస్తులను కంప్యూటర్ ఆపరేటర్ వద్ద నమోదు చేయించుకుంటున్న అర్జీదారులు

- ఒంటిగంట వరకే గ్రీవెన్స్
- లంచ్ తర్వాత కనిపించని అధికారులు
- ఆపరేటర్‌కు దరఖాస్తులు ఇచ్చి వెనుదిరిగిన ప్రజలు

అంబేద్కర్ చౌక్, ఆగస్టు 12 : సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చే అర్జీదారులకు నిరాశే మిగులుతున్నది. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ మధ్యాహ్నం ఒంటిగంట వరకే సాగుతుండగా, ఆపై ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారి మొర ఆలకించేవారు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే సరికే మధ్యాహ్నం ఒంటిగంట దాటుతుందని, తాము వచ్చే సరికి అధికారులు భోజనానికి వెళ్లిపోవడం.. ఆపై ఇతర మీటింగ్‌లలో బిజీగా ఉండడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత అధికారులంతా లంచ్‌కు వెళ్లిపోయారు. ఆ తర్వాత వచ్చిన అర్జీదారులు గ్రీవెన్స్ చాంబర్‌లో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్‌కు దరఖాస్తులు ఇచ్చి వెళ్లిపోయారు.

ఆసిఫాబాద్ : అర్జీలు తీసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

నస్పూర్ : ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

-జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 12 : ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరివేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.

సమన్వయంతో ముందుకెళ్తాం

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఆగస్టు 12 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.

మందమర్రిలో బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ

మందమర్రి బల్దియా ఎదుట బీఆర్ఎస్ ధర్నా

- కేసీఆర్ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్
- వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బైఠాయింపు
- పాత బస్టాండ్ నుంచి కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- కమిషనర్ వెంకటేశ్వర్లకు వినతి

మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, ఆగస్టు 12 : కేసీఆర్ సర్కారులో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు పాత బస్టాండ్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు డప్పుచప్పుళ్ల నడుమ భారీ ర్యాలీ తీశారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని బైఠాయించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ నులిగొండ వెంకటేశ్వర్లకు అందించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ ఆయా వార్డుల్లో సమస్యలు నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. స్థానిక యాపల్, కేకే2. కేకే 3 ఫిల్టర్‌బెడ్ ఏరియాల్లో శ్మశాన వాటికల కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇప్పటి వరకు నిర్మించడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగాన్ని అవమాన పరుస్తూ, నిర్వీర్యం చేస్తూ మున్సిపాలిటీకి చెందిన రూ. కోటి 20 లక్షల అభివృద్ధి పనులను పంచాయతీ వ్యవస్థకు అప్పగిండంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అలాగే అసంపూర్తిగా ఉన్న సమీకృత మార్కెట్ భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఆర్‌వోబీపై లైటింగ్, మినీ ట్యాంక్‌బండ్‌పై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి సినిమా హాల్ వరకు, అంబేద్కర్ చౌరస్తా నుంచి మార్కెట్ గంప శంకరయ్య దుకాణం వరకు రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. పాతబస్టాండ్ జయశంకర్ సార్ చౌరస్తా నుంచి రామన్ కాలనీ వరకు అసంపూర్తిగా ఉన్న డివైడర్‌ను పూర్తి చేయాలన్నారు. వివిధ వార్డుల్లో దోమలు, కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు రాజశేఖర్, ఎండీ అబ్బాస్, కొంగల తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, పంజాల ఈశ్వర్, పల్లె నర్సింగ్, మేడిపల్లి మల్లేశ్, వేల్పుల కిరణ్, సంగ వెంకటేశ్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, సీపెల్లి సాగర్, ఎండీ ముస్తఫా, మహిళా నాయకులు సుగుణ, ఈశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇక వైద్యం చేయొద్దు

- స్థాయిని మరచి ట్రీట్‌మెంట్ చేయడం మానుకోండి
- డీఎంహెచ్‌వో తుకారాం భట్ ఆదేశం
- డీపీవో, ఆర్డీవోతో కలిసి గుండాయిపేటలో పర్యటన
- క్లినిక్‌లు, మెడికల్ షాపుల తనిఖీ

మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం భట్, అధికారులు

కౌటాల, ఆగస్టు 12 : ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇక వైద్యం చేయడం ఆపేయాలని జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ ఆదేశించారు. సోమవారం గుండాయిపేట గ్రామంలో డీపీవో భిక్షపతి గౌడ్, ఆర్డీవో సురేశ్‌బాబుతో కలిసి పర్యటించారు. ఆర్ఎంపీ, పీఎంపీల పనితీరుపై మండి పడ్డారు. స్థాయిని మరచి ఇష్టారీతిన ట్రీట్‌మెంట్ చేయడం, ఇంజెక్షన్‌లు, సెలైన్‌లు, పెయిన్‌కిల్లర్‌లు ఇవ్వడం మానుకోవాలన్నారు. ఇంతటి ట్రీట్‌మెంట్ చేయాలంటే చదువు, పరిజ్ఞానం ఉండాలని, అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గుండాయిపేట గ్రామంలో క్లినిక్‌లు, ట్రీట్‌మెంట్‌లు ఆపేయాలని, తిరిగి చెప్పేదాకా ట్రీట్‌మెంట్ చేయడానికి వీల్లేదని ఆదేశించారు. మెడికల్ షాప్‌లను తనిఖీ చేశారు. రూరల్‌లో ఉండాల్సిన వాటికన్న స్టెరాయిడ్, హెవీ పెయిన్ కిల్లర్లు ఉన్నట్లు గుర్తించారు. ఆర్ఎంపీలు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. జీడీ ఆర్ఎంపీ క్లినిక్‌లో నాలుగు నెలల క్రితం కాలం చెల్లిన సిరప్‌లను గుర్తించారు. ఆయుర్వేద, హోమియోపతి మందులను గుర్తించారు. వీటిని ఎవరిస్తారని అడిగితే.. అన్ని మందులు తానే ఇస్తానని ఆర్ఎంపీ చెప్పడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రెండు రోజుల క్రితం జ్వరంతో మృతి చెందిన జాడే పూజ, బోయర్ కాళీదాస్ కుటుంబాలను పరామర్శించి, కుటుంబీకుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి రక్తపు నమూనాలను సేకరించారు. ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన వైద్యం అందిస్తారని, ఆర్ఎంపీల వద్దకు పోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని గ్రామస్తులకు సూచించారు. పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని డీపీవో సూచించారు. వైద్య, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పర్మినెంట్ చేయిస్తామని డబ్బులు వసూలు..?

పర్మినెంట్ చేయిస్తామనడంతో డబ్బులు ఇచ్చామని చెబుతున్న బాధితులు

- వేధింపులు తాళలేక ఓ కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం.. వీడియో కలకలం
- మంచిర్యాల ఐదో వార్డు కౌన్సిలరే కారణమంటూ ఆరోపణ
- కార్మికుల వద్ద రూ.4.40 లక్షలు తీసుకొని మోసగించారంటున్న బాధితుడు
- తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్న కౌన్సిలర్

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నవీన్(చింటూ)

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 12 : మంచిర్యాల మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్న మడుగుల నవీన్ (చింటూ) సోమవారం తెల్లవారు జామున నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం జిల్లాలో కలకలం రేపింది. బాధితుడు నవీన్ కథనం ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. అనారోగ్యంతో ఉన్న కొందరి పర్మినెంట్ కార్మికుల స్థానంలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోడానికి 22 మందికి అవకాశం వచ్చింది. దీంతో హరికృష్ణ కొద్ది రోజుల క్రితం కాంట్రాక్టు కార్మికులందరినీ సున్నంబట్టివాడలోని ఓ జిమ్ సెంటర్‌కు పిలిపించి పర్మినెంట్ చేయిస్తామని హామీ ఇచ్చారు. మీ పేర్లు రిజిస్టర్‌లో ఎక్కాలంటే ఒక్కొక్కరూ రూ.55 వేలు ఇవ్వాలని చెప్పారు. మీకు ఏదైనా సమాచారం కావాలంటే ఇక నుంచి నవీన్ (చింటూ)ను కలవండి అన్నాడు. నవీన్ అప్పుడు కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. 22 మందిలో 8 మంది ముందుకు వచ్చి 2023 ఆగస్టులో రూ.4.40 లక్షలు నవీన్‌కు అప్పగించారు. ఆ డబ్బులను తీసుకెళ్లి కౌన్సిలర్‌కు ఇచ్చినట్లు బాధితుడు చెబుతున్నాడు. కొన్ని రోజులు గడిచాక డబ్బులు ఇచ్చిన కాంట్రాక్ట్ కార్మికులు ఇంకా తమ పేర్లు ఎక్కించడం లేదని, ఏమైందని నవీన్‌ను నిలదీశారు. దీనిపై కౌన్సిలర్‌ను వెళ్లి కలవగా ఎలక్షన్ కోడ్ అమలులో ఉందని, ఇప్పుడు పనులు కావంటూ వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఎన్నికలయ్యాక పని కాకపోవడంతో ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాల్సిందేనని సదరు కార్మికులు నవీన్‌ను నిలదీశారు. విషయం పెద్దది కావడంతో 2024 జనవరిలో పట్టణంలోని చంద్రదత్ హాస్పిటల్ పక్కన ఉన్న క్లబ్‌లో యూనియన్ కాంట్రాక్ట్ కార్మికులందరూ హరికృష్ణను పిలిపించి పంచాయతీ చేశారు. ఇక్కడ డబ్బులు తిరిగి కట్టేందుకు సదరు కౌన్సిలర్ అంగీకరించినట్లు చెబుతున్నారు. ఈ పంచాయతీ జరిగిన నాలుగు రోజులకు యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నవీన్ (చింటూ) పదవికి రాజీనామా చేశారు. తమకు ఇస్తానన్న డబ్బుల కోసం సదరు కార్మికులు 10 రోజులు గడిచిన తర్వాత హరికృష్ణకు ఫోన్ చేసి అడుగగా, నవీన్ యూనియన్‌లో లేడు.. డబ్బులు ఇవ్వడం కుదరదంటూ చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని రెండు నెలల క్రితం బాధితులు నవీన్‌తో కలిసి వెళ్లి స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దొరకక పోవడం, ఎక్కడికెళ్లినా న్యాయం జరగకపోవడంతో బాధితులు ఈ నెల 5న మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కౌన్సిలర్‌పై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ సైతం అదే రోజు కార్మికులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ముందు నుంచి జరిగిన దంతా చెబుతూనే.. సూసైడ్ చేసుకోబోతున్నట్లు నవీన్ ఆదివారం వీడియో విడుదల చేశాడు. దీంతో తననే బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నారంటూ కౌన్సిలర్ ఆదివారం మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడి తెలిపాడు. కౌన్సిలర్ తీరుతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు నవీన్ తెలిపాడు. ఈ విషయంపై మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇదే విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణను వివరణ కోరగా.. 'కార్మికుల నుంచి నవీన్ డబ్బులు వసూలు చేశాడు. అతను తీసుకున్న డబ్బులకు.. నాకు ఎలాంటి సంబంధం లేదు. తొలి సారి జరిగిన సమావేశంలో ఎవ్వరికీ డబ్బులు ఇవ్వొద్దని కార్మికులకు చెప్పాను. దాన్ని వక్రీకరించి నేనే డబ్బులు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు బాధితుల నుంచి ఒత్తిడి రావడంతో నాపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారు' అంటూ కౌన్సిలర్ చెప్పుకొచ్చాడు. కార్మికులకు న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కాగా, నవీన్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

జాయింట్ సర్వే పేరుతో అక్రమాలు

- సంబంధం లేని వ్యక్తుల పేరుపైకి భూములు మార్చారు
- ప్రజావాణిలో తంగళ్ల పెల్లి గ్రామ రైతుల ఫిర్యాదు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తంగళ్ల పెల్లి గ్రామ రైతులు

మంచిర్యాల, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భీమిని మండలం తంగళ్లపెల్లి గ్రామంలో 2022, మేలో నిర్వహించిన జాయింట్ సర్వేలో అనేక అవకతవకలు జరిగాయని ఆ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న భూములపై పట్టాలు లేకపోవడంతో జాయింట్ సర్వే చేసి పట్టాలు ఇప్పిస్తానని చెప్పి మాజీ సర్పంచ్ తమను మోసం చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూములతో సంబంధం లేని వ్యక్తుల నుంచి డబ్బులు తీసుకొని కొన్ని సర్వే నంబర్లలోని భూములను వారి పేర్ల మీదకు మార్చారన్నారు. క్షేత్రస్థాయిలోని అధికారులతో కలిసి సీసీఎల్ఏ హైదరాబాద్, కలెక్టర్‌కు తప్పుడు నివేదిక సమర్పించి తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఈ మేరకు సర్వే నిర్వహించిన అప్పటి అధికారులు, మాజీ సర్పంచ్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంలోని ప్రజావాణిలోని ఫిర్యాదు చేశామని, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలను జిల్లా అధికారులు పాటించడం లేదంటూ వాపోయారు. వారసత్వంగా రావాల్సిన 31 ఎకరాలు సంబంధం లేని వ్యక్తుల చేతికి వెళ్లకుండా చూడాలని, ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచ్‌ను వివరణ కోరగా.. పారదర్శకంగానే జాయింట్ సర్వే సాగిందన్నారు. ఇందులో తాను ఎవరినీ తప్పుదోవ పట్టించలేదన్నారు. ఎలాంటి విచారణ చేసినా తనకు అభ్యంతరం లేదన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- రేవంత్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉండి విఫలం
- ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కాగజ్‌నగర్‌లో సమ్మెకు మద్దతు
- సమస్య పరిష్కరించకుంటే మూకుమ్మడిగా రాజీనామా : కౌన్సిలర్లు

మున్సిపల్ కార్మికులకు భరోసానిస్తున్నా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఆగస్టు 12 : కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు కనీసం వేతనాలు చెల్లించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఇకనైనా చొరవ తీసుకొని వారి సమస్యకు పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్‌లో 19 రోజులుగా కార్మికులు చేపడుతున్న సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా ఉండి కూడా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు, ప్రకటనల ఖర్చులు తగ్గించుకుంటే వేలాది మంది కార్మికుల సమస్య పరిష్కరించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ కన్వీనర్ లెండుగూరే శ్యాంరావు, నాయకులు మనోహర్, ఓదెలు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయాలి

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్, మున్సిపల్ కమిషనర్ అంజయ్యను కోరారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికుల సమస్యలపై విచారణకు వచ్చిన ఆర్డీ షాహిద్ మసూద్‌ను ఆయన మున్సిపల్ కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఆర్డీతో పాటు మున్సిపల్ కమిషనర్‌లు మాట్లాడుతూ మున్సిపాలిటీకి ప్రతి నెలా కేవలం రూ.10 లక్షల ఆదాయమే వస్తుందని, కార్మికులకు ప్రతి నెలా వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లింపులు కలిపి రూ.41 లక్షలు అవసరముందన్నారు. మున్సిపాలిటీకి ఆదాయం లేనప్పుడు ఇంత మంది కార్మికులకు ఎందుకు నియమించారని ఆర్ఎస్పీ ప్రశ్నించారు.

మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని కౌన్సిలర్లు స్పష్టం చేశారు. మంత్రి సీతక్క, సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్య గురించి చెబుతామని, పరిష్కారం కాకపోతే కౌన్సిలర్లందరం రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు.

సమ్మె విరమించేది లేదు

సమస్య పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని, మూడు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీ షాహిద్ మసూద్ హామీ ఇచ్చారు. తక్షణమే సమస్య పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని, లేదంటే కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పూర్తిస్థాయి సేవలు నిలిపివేత

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులు పూర్తి స్థాయి సమ్మెకు దిగుతున్నారు. మంగళవారం నుంచి వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే కార్మికులు సమ్మెకు దిగుతున్నట్లు కార్మిక సంఘం అధ్యక్షుడు శంకర్ తెలిపారు.